JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 18-07-2026
Medchal - Malkajgiri । Saturday 18-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 47
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 47 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





## మోస్ట్ వాంటెడ్ నితీశ్ కౌశల్ అరెస్ట్

- ప్రపంచవ్యాప్తంగా ఈ ముఠాకు 1,000 మందికి పైగా సభ్యులు, అనుచరులు ఉండగా, ఒక్క అమెరికాలోనే 100 మందికి పైగా ఉన్నారని ప్రాసిక్యూటర్లు ఆరోపన

**జయభేరి, ఛండీఘడ్, జూలై 17 :**

ఎఫ్‌బీఐ భారీ దెబ్బకొట్టింది. పంజాబ్ కేంద్రంగా పనిచేస్తున్న గ్యాంగ్‌స్టర్ జగ్గూ భగవాన్‌పురియాకు చెందిన అంతర్జాతీయ ముఠాలో కీలక సభ్యుడైన నితీశ్ కౌశల్‌ను యూఎస్‌లోని వర్మోంట్‌లో అరెస్ట్ చేసింది. కొద్ది రోజుల క్రితమే ఎఫ్‌బీఐ తన 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో నితీశ్‌ను చేర్చగా, తాజాగా అతడిని అదుపులోకి తీసుకున్నట్టు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ ముఠాకు సంబంధించిన ఇతర పరారీలో ఉన్న నేరగాళ్ల సమాచారం కోసం ప్రజల సహాయాన్ని కూడా ఎఫ్‌బీఐ కోరింది. జగ్గూ భగవాన్‌పురియా ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్ అనేది భారత్‌లోని పంజాబ్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠా. అమెరికా, కెనడా, యూకే, యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో దీని నెట్‌వర్క్ విస్తరించి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ ముఠాకు 1,000 మందికి పైగా సభ్యులు, అనుచరులు ఉండగా, ఒక్క అమెరికాలోనే 100 మందికి పైగా ఉన్నారని ప్రాసిక్యూటర్లు ఆరోపిస్తున్నారు. హత్యలు, కిడ్నాపులు, డ్రగ్స్ రవాణా, బలవంతపు వసూళ్లు, ఆయుధాల అక్రమ రవాణా, మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరాల ద్వారా ఈ ముఠా ఆదాయం సంపాదిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. కాలిఫోర్నియా జిల్లా కోర్టు జూన్ 25న నితీశ్ కౌశల్‌పై ఫెడరల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అతడిపై కఠినమైన 'రికో' చట్టం కింద అభియోగాలు మోపారు. ఈ ముఠాలో 'లాలా' అనే మారుపేరుతో

...మిగతాది 2 లో




## ఫిఫా కప్ ను ముద్దాడిన ట్రంప్

- ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం అధ్యక్షుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

**జయభేరి, న్యూయార్క్, జూలై 17 :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిష్ఠాత్మక ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు హాజరుకానున్నారు. న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో ఎల్లుండి జరగనున్న ఈ ఫైనల్ పోరులో విజేతగా నిలిచిన జట్టుకు, ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినోతో కలిసి ట్రంప్ ట్రోఫీని ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని వైట్ హౌస్, ఫిఫా వర్గాలు అధికారికంగా ధ్రువీకరించాయి. స్పెయిన్, అర్జెంటీనా మధ్య జరగనున్న ఈ తుది పోరుకు ట్రంప్ హాజరు కానుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ.. "ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించడంలో అమెరికా సత్తాను ఈ టోర్నమెంట్ చాటి చెప్పింది. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం అధ్యక్షుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని ఆమె తెలిపారు. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యమిస్తున్నప్పటికీ, ట్రంప్ ఇప్పటివరకు ఏ మ్యాచ్‌కు హాజరుకాలేదు. ఫైనల్‌కు ఆయన రాక ఖరారు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అతిథ్య దేశాధినేత, ఫిఫా అధ్యక్షుడితో కలిసి ట్రోఫీని అందించడం

...మిగతాది 2 లో

# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు



- ధరణిలో అక్రమాల దర్యాప్తునకు సిట్..
- బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్పు..
- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు
- టోల్ ఫ్రీ నంబర్ : 1-800-123-7157

2 లో

*తెలంగాణ కేబినెట్ సమావేశంలో ధరణి పోర్టల్ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భూ రికార్డుల మార్పులు, అక్రమ లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరగనుంది. బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పులు, నీటిపారుదల ప్రాజెక్టుల పెరిగిన వ్యయాలకు ఆమోదం తెలిపారు. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చట్ట సవరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపులకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవలసిన చర్యలపై మంత్రిమండలి సుదీర్ఘంగా చర్చించింది.*

**జయభేరి, హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్ర రాజకీయాలు, పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కీలక అంశాలపై చర్చించిన కేబినెట్.. ముఖ్యంగా ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూముల లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. టెక్నికల్ నిపుణులు, వివిధ శాఖల అధికారులతో ఈ సిట్ పనిచేయనుండగా.. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అదే సమావేశంలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు సంబంధించిన అలైన్‌మెంట్ మార్పులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే పాలమూరురంగారెడ్డి, దేవాదుల, చిన్న కాళేశ్వరం, సీతారామ నీటిపారుదల ప్రాజెక్టుల పెరిగిన అంచనా వ్యయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు.. విద్యారంగంలో భాగంగా డిగ్రీ కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి కూడా అనుమతి మంజూరైంది.



2 లో

## పశ్చిమ్ బెంగాల్‌లో కలకలం




2 లో

## బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి

- ఎట్టకేలకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ కు అనుమతి దక్కింది
- ఈ సభ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథి

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. బీఆర్ఎస్ అనుబంధ యువజన, విద్యార్థి సంఘాలు ఈ సదస్సు నిర్వహణకు నిర్ణయించారు. తొలుత పోలీసులు ఈ సదస్సుకు అనుమతి నిరాకరించారు. దీంతో.. నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో, తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది.

## పల్నాడు పౌరుషం చూపించండి



*పల్నాడు పౌరుషానికి కేరాఫ్ అడ్రస్ అని, ఇక్కడి ప్రజలు ఆ పౌరుషాన్ని వ్యాపార రంగంలోనూ చూపించి లాభాలు గణించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష మేరకు బ్యాంకులు ప్రజల చెంతకు వచ్చి సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని ఆమె స్పష్టం చేశారు.*

- నిర్మలమ్మ సంచలన పిలుపు
- లబ్ధిదారులకు రుణ వితరణ పత్రాలు, చెక్కులను పంపిణీ

**జయభేరి, పల్నాడు :**

పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన భారీ 'క్రెడిట్ అవుట్ రీచ్' (రుణమేళా) కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల కింద మొత్తం 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల భారీ రుణాలను వారి చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద యూనియన్ బ్యాంక్ అందించిన అంబులెన్సులను జెండా ఊపి ప్రారంభించారు. అలాగే, బాలికలకు సైకిళ్లు, వివిధ రంగాల లబ్ధిదారులకు రుణ వితరణ పత్రాలు, చెక్కులను పంపిణీ చేశారు. హామీ లేకుండానే రుణాలు: నిర్మలా సీతారామన్ సభలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తూ, వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి, వారి వ్యాపారాలకు సహకరించాలన్నదే మోదీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. "తోపుడు బండి వ్యాపారులు మార్కెట్లో మధ్యవర్తుల నుంచి రూ.1000 అప్పు తీసుకుంటే, రూ.900 మాత్రమే చేతికి వస్తాయి. సాయంత్రానికి రూ.1000 కట్టాలి. ఇలాంటి అధిక వడ్డీల వల్ల వారికి మిగిలేది ఏమీ లేదు. అందుకే, ఎలాంటి హామీ (గ్యారంటీ) లేకుండా, తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. మైక్రో ఫైనాన్స్ కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి మోసపోవద్దు," అని ఆమె సూచించారు. 2004 నుంచి 2014 వరకు ఉన్న యూపీఏ ప్రభుత్వ హయాంలో 'ఫోన్ బ్యాంకింగ్' ద్వారా ఎవరికి అప్పులు ఇవ్వాలో పైనుంచి నిర్దేశం చేవారని, కానీ మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారాయని ఆమె విమర్శించారు. ఇప్పుడు అర్హత ఉంటే చాలు, బ్యాంకులే గ్రామ గ్రామానికి వెళ్లి రుణాలు ఇస్తున్నాయని, నరసరావు పేట కార్యక్రమమే దీనికి నిదర్శనమని అన్నారు. 2047 నాటికి భారతదేశం 'వికసిత్ భారత్'గా, అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్నదే లక్ష్యమని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు.



2 లో

## రైల్వే చరిత్రలో సరికొత్త విప్లవం

- భారత రైల్వే చరిత్రలో సరికొత్త విప్లవానికి నాంది
- భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ
- హైడ్రోజన్ రైళ్ల ను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది

**జయభేరి, ఛండీఘడ్, జూలై 17 :**

భారత్‌లో తొలి పర్యావరణహిత హైడ్రోజన్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ 10 కోచ్‌ల రైలు నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ కాలుష్య రహితంగా ప్రయాణిస్తుంది. ఈ తొలి హైడ్రోజన్ రైలు హరియాణాలోని జింద్ సోనిపత్ మధ్య సేవలు అందిస్తుంది. భారత రైల్వే చరిత్రలో సరికొత్త విప్లవానికి నాంది పలికారు. దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఇంధన రైలు పట్టాలెక్కింది. హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును లాంఛనంగా ప్రారంభించారు. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలకు పెద్దపీట వేస్తూ, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో మన ఇంజినీర్లు ఈ మోడ్రన్ రైలును రూపొందించారు. స్టీమ్, డీజిల్, విద్యుత్ రైళ్ల తర్వాత భారత రైల్వే ప్రస్థానంలో ఇదొక మైలురాయిగా నిలిచింది. స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## రైల్వే చరిత్రలో సరికొత్త విప్లవం

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది.
ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతి కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీఅమృత్‌సర్‌కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీకత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీఅమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది.
ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.అదేవిధంగా అంబాలాకాలా అంబ్, జింద్‌గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్‌గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీబరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

**హైడ్రోజన్ రైలు ప్రత్యేకతలు ఇవే..**

హైడ్రోజన్ రైలు సాధారణ విద్యుత్ రైళ్లలా కాకుండా, తన శక్తిని తానే స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. ఇందులోని 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల ప్రొటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్ ప్లాంట్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ల మధ్య రసాయన చర్య జరిగి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్ 3,200 హెచ్‌పీ ప్రొపల్షన్ వ్యవస్థ ద్వారా మోటార్లకు అంది, రైలు గంటకు దాదాపు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా చేస్తుంది. ఇంధన దహనచర్య లేకపోవడం వల్ల హైడ్రోజన్ రైలు నుంచి కేవలం నీటి ఆవిరి, వేడి మాత్రమే వెలువడుతాయి. హానికారక కర్బన ఉద్గారాలు, శబ్ద కాలుష్యం లేని పర్యావరణహిత ప్రయాణం వీలవుతుంది.
ఈ రైలులో అత్యున్నత రక్షణ ప్రమాణాలతో కూడిన పలు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. హైడ్రోజన్ లీకేజీలు, వేడి లేదా మంటలను క్షణాల్లో గుర్తించి అప్రమత్తం చేసే ఆటోమేటిక్ షట్ ఆఫ్ వ్యవస్థను సెటప్ చేశారు. నిరంతర వెంటిలేషన్ సౌకర్యం వల్ల ఒకవేళ లీకేజీ జరిగినా గ్యాస్ గాల్లో కలిసిపోతుంది. లోకోపైలట్ కేబిన్‌ను సైతం ప్రత్యేకంగా డిజైన్ చేసి, అన్ని భద్రతా అంశాలను పర్యవేక్షించేలా ఇందులో స్క్రీన్‌ను అమర్చి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ రైలు నిర్వహణ కోసం జింద్‌లో ప్రత్యేకంగా హైడ్రోజన్ నిల్వ, డిస్పెన్సింగ్ కేంద్రాన్ని నిర్మించారు.తొలి దశలో ఈ హైడ్రోజన్ రైలు నార్త్ రైల్వే పరిధిలోని హర్యానాలోని జింద్ సోనిపత్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో 12 స్టేషన్లలో హాల్ట్ ద్వారా ప్రయాణించనుంది. రానున్న రోజుల్లో కల్కా షిమ్లా వంటి మార్గాల్లోనూ హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా జర్మనీ, చైనా వంటి దేశాల్లో 2 నుండి 4 కోచ్‌లతో మాత్రమే హైడ్రోజన్ రైళ్లు నడుస్తుండగా, భారత్ రికార్డు స్థాయిలో 10 కోచ్‌లతో, ఒకేసారి 2,600 మంది ప్రయాణించేలా రైలును తీసుకొచ్చారు.

## ఫిఫా కప్ ను ముద్దాడిన ట్రంప్

ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయమని ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినో తెలిపారు. "గతంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాం. 2022లో ఖతార్ ఎమిర్, 2018లో రష్యా అధ్యక్షుడు కూడా ట్రోఫీ ప్రదానంలో పాల్గొన్నారు. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తాం" అని ఆయన స్విస్ మీడియాతో అన్నారు.ట్రంప్, ఇన్ఫాంటినో మధ్య చాలాకాలంగా మంచి సంబంధాలు ఉన్నాయి. 2025 డిసెంబర్ లో జరిగిన టోర్నమెంట్ డ్రా సందర్భంగా ట్రంప్ ఫిఫా తొలి శాంతి బహుమతిని అందుకున్నారు. గత వేసవిలో ఇదే మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగిన క్లబ్ వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా ట్రంప్ ట్రోఫీని అందించారు.
ఆ సమయంలో ఆయనకు అభిమానుల నుంచి చప్పట్లతో పాటు నిరసనల రూపంలో కేకలు కూడా ఎదురయ్యాయి.ఈ టోర్నమెంట్ లో ట్రంప్ ప్రమేయం కేవలం ఫైనల్స్‌కే పరిమితం కాలేదు. రౌండ్‌ఆఫ్16 మ్యాచ్‌కు ముందు అమెరికా స్ట్రైకర్ ఫోలరిన్ బలోగన్‌పై విధించిన రెడ్ కార్డ్ నిషేధాన్ని సమీక్షించాలని ట్రంప్ స్వయంగా ఇన్ఫాంటినోను కోరినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఫిఫా ఆ నిషేధాన్ని ఎత్తివేయడంతో ఇది రాజకీయ జోక్యమంటూ తీవ్ర వివాదం చెలరేగింది. అయితే, ఆ మ్యాచ్‌లో బెల్జియం చేతిలో అమెరికా ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.ప్రపంచమంతా ఆదివారం జరగనున్న స్పెయిన్‌అర్జెంటీనా ఫైనల్ పోరుపై దృష్టి సారించిన నేపథ్యంలో ట్రంప్ హాజరు ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను చేకూర్చనుంది. దీనికి ముందు నేడు న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్‌లో జరిగే ఫిఫా రిసెప్షన్‌లో కూడా ట్రంప్ పాల్గొంటారని వైట్ హౌస్ వర్గాలు పేర్కొన్నాయి.

## మోస్ట్ వాంటెడ్ నితీశ్ కౌశల్ అరెస్ట్

పిలువబడే నితీశ్ కౌశల్ కీలక పాత్ర పోషించినట్టు ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. ముఠా తరపున కిడ్నాపులు, దాడులు వంటి హింసాత్మక చర్యలకు పాల్పడేవాడని అభియోగపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా 2024 జులై 10న జరిగిన ఒక కిడ్నాప్ ఘటనలో నితీశ్ ప్రధాన పాత్రధారి అని ప్రాసిక్యూటర్లు తెలిపారు. ముఠాకు చెందిన డ్రగ్స్ షిప్‌మెంట్‌ను ఒక వ్యక్తి దొంగిలించాడని భావించి, అతడిని కాలిఫోర్నియాలోని మాంటెకాలో ఒక ఇంటికి రప్పించారు. అక్కడ నితీశ్‌తో పాటు మరో ముగ్గురు కలిసి బాధితుడిని బంధించి, తీవ్రంగా కొట్టి ఫ్రెస్నోలోని ఒక అపార్ట్‌మెంట్‌కు తరలించారు. దొంగిలించబడిన డ్రగ్స్‌కు నష్టపరిహారంగా 50,000 డాలర్లు డిమాండ్ చేశారు. అయితే, ముఠాలోని అంతర్గత వివాదాన్ని పరిష్కరించుకునేందుకు జగ్గూ భగవాన్‌పురియా ఆదేశాలతో బాధితుడిని తర్వాత విడిచిపెట్టారని ఆరోపణలు ఉన్నాయిఈ ముఠా ప్రధానంగా డ్రగ్స్ రవాణాపై ఆధారపడి పనిచేస్తుంది. దక్షిణ కాలిఫోర్నియాలో కొకైన్, మెథామ్‌ఫెటమైన్ వంటి డ్రగ్స్‌ను సేకరించి, భారీ సెమీట్రక్కుల ద్వారా అమెరికా తూర్పు తీరానికి, కెనడా సరిహద్దుకు తరలించేవారు. ఒక్కో షిప్‌మెంట్‌లో 100 కిలోల వరకు డ్రగ్స్ ఉండేవని ప్రాసిక్యూటర్లు తెలిపారు. సుపారీ హత్యలు, ప్రత్యర్థి ముఠాల నుంచి డ్రగ్స్ దొంగిలించడం, బలవంతపు వసూళ్లు వంటివి కూడా వీరి కార్యకలాపాల్లో భాగమే. బాధితుల కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భారత్‌లో నివసించే వారి వివరాలు సేకరించి, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా బెదిరించి డబ్బులు వసూలు చేసేవారు. పంజాబ్‌లోని కొందరు అవినీతి పోలీసు అధికారులతో కలిసి ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయించి, వాటిని ఉపసంహరించుకోవడానికి డబ్బు డిమాండ్ చేసేవారని కూడా అభియోగపత్రంలో ఉంది. పంజాబ్‌లోని యువతకు డబ్బు, అధికారం, విదేశీ అవకాశాలు ఆశ చూపి ముఠాలోకి చేర్చుకునేవారు.నితీశ్ కౌశల్ అరెస్ట్‌తో ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై దర్యాప్తులో కీలక ముందడుగు పడినట్టయింది. అయితే, ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో రుజువు కావాల్సి ఉంది. విచారణ పూర్తయ్యేవరకు నిందితులను నిర్దోషులుగానే పరిగణించాల్సి ఉంటుంది.

# ఇస్రోలో ఏం జరుగుతోంది...




ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఆర్‌వో) ఇటీవలి నెలల్లో తన అనుభవజ్ఞులైన సైంటిస్టులను కోల్పోతోంది. ఈ పరిణామం దేశంలోని అత్యంత ముఖ్యమైన అంతరిక్ష కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీవోఎస్) తక్షణ చర్యలు తీసుకుంటోంది.కొన్నినెలలుగా ఐఎస్ఆర్‌వోనుంచి 100 నుంచి 120 మంది సైంటిస్టులు రాజీనామా చేశారు. ఇందులో అనుభవం, నైపుణ్యం ఉన్న వారు కూడా ఉన్నారు. వంద మందికిపైగా సైంటిస్టులు ఇస్రోను వీడడం మామూలు విషయం కాదు. సంస్థలో ప్రతీ సైంటిస్టు పని అనుభవం, జ్ఞానం అనేది సంస్థకు ఒక ఆస్తి. వంద మందికిపైగా సంస్థను వీడడం మిషన్ల నాణ్యత, టైమ్‌లైన్లపై నేరుగా ప్రభావం చూపుతుంది.భారతదేశం మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)వంటి చారిత్రాత్మక మిషన్లను చేపట్టింది. ఇలాంటి ప్రాజెక్టులలో పనిచేసే సైంటిస్టులు రాజీనామా లేదా వాలంటరీ రిటైర్‌మెంట్ కోరినప్పుడు, వాటిని వెంటనే ఆమోదించవద్దని ఇస్రో కేంద్రాలకు డీవోఎస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదులుగా, అలాంటి అభ్యర్థనలను డీవోఎస్‌కు పంపి, అక్కడి నుంచి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇది సాధారణ ఆదేశం కాదు. కీలక మిషన్లలో పనిచేసే నిపుణులను త్వరగా కోల్పోకుండా రక్షించేందుకు తీసుకున్న జాగ్రత్త చర్య.డీవోఎస్ జోక్యం చేసుకోవడం రెండు విషయాలను స్పష్టం చేస్తోంది. ఒకటి ఇస్రోలోని అనుభవజ్ఞులైన సైంటిస్టులను నిలుపుకోవడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకుంది. రెండోది సంస్థలోని మానవ వనరుల నిర్వహణను కేంద్రీకృతం చేయాలనుకుంటోంది. ప్రతి రాజీనామా అభ్యర్థనను వ్యక్తిగతంగా పరిశీలించి, సంస్థకు అవసరమైన నైపుణ్యాలను కాపాడుకోవాలన్నది ఈ ఆదేశాల ముఖ్య ఉద్దేశం. ఇది సంస్థలోని పని వాతావరణం, పరిహారం, కెరీర్ అవకాశాల వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.ఇస్రో వంటి సంస్థలో సైంటిస్టుల రాజీనామాలు కేవలం వ్యక్తిగత నిర్ణయాలు మాత్రమే కావు. అవి సంస్థలోని నిర్వహణ, ప్రోత్సాహకాలు, బాహ్య అవకాశాలు వంటి విస్తృత కారణాలను ప్రతిబింబిస్తాయి. అనుభవజ్ఞులైన వారు బయటకు వెళ్లడం వల్ల కొత్తగా వచ్చే వారికి ఆ జ్ఞానాన్ని బదిలీ చేయడం కష్టమవుతుంది. పని ఒత్తిడి తగ్గించడం, మెరుగైన పరిహారం, కెరీర్ వృద్ధి అవకాశాలు, ప్రైవేట్ రంగంతో పోటీపడే విధంగా విధానాలు రూపొందించడం వంటివి ఆలోచించాల్సిన అవసరం ఉంది.ఇస్రో భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు మూలస్తంభం. దాని విజయం సైంటిస్టుల ప్రతిభ, అంకిత భావంపై ఆధారపడి ఉంది.
డీవోఎస్ ఇచ్చిన ఆదేశాలు ఈ ప్రతిభను రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యగా కనిపిస్తున్నాయి. అయితే, ఇది కేవలం ఆదేశాలతో మాత్రమే సాధ్యం కాదు. సంస్థలోని వాతావరణం, అవకాశాలను మెరుగుపరచడం ద్వారానే దీర్ఘకాలికంగా ప్రతిభావంతులను నిలుపుకోవచ్చు.ఇస్రో మెమో గురించి అడిగిన ప్రశ్నకు సింగ్ సమాధానమిస్తూ.. అది కేవలం పరిపాలనా కారణాలతోనే జరిగిందని చెప్పారు. "లేదు, అది ఎందుకంటే... మరింత పరిణతి చెందిన స్థాయిలో నిర్ణయం తీసుకునేందుకు వీలుగా పరిపాలనా కారణాల వల్ల అలా చేశాం" అని కేంద్ర మంత్రి అన్నారు. ఇస్రోలో చాలా మంది ఉద్యోగులు ఉన్నారని, కొందరు వెళ్లిపోతుంటే మరి కొందరు కొత్తగా చేరుతుంటారని ఆయన అన్నారు. "చాలా మంది వెళ్లారు, చాలా మంది వచ్చారు" అని చెబుతూ ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదని ఆయన స్పష్టం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రంలో ఏమీ జరగనప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు.ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చెన్నైకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ అగ్నికుల్ కాస్మోస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అబ్జర్వర్‌గా చేరారు. జనవరి 2025 వరకు ఇస్రో ఛైర్మన్‌గా కొనసాగిన కాలంలోనే జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్3 విజయవంతంగా ల్యాండింగ్, భారత్ తొలిసారిగా సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్ 1 వంటి పలు చారిత్రాత్మక మిషన్లు చేపట్టారు.ఇక, భారత భవిష్యత్తు అంతరిక్ష మిషన్లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిస్తూ.. గతంలో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. "దాదాపు పదేళ్ల కిందట జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి ఒక మనిషిని పంపడం సులభమే కానీ, తిరిగి సురక్షితంగా తీసుకురావడం కూడా అంతే కష్టంతో కూడుకున్న పని అని చెప్పారు.. ఆ విధంగానే క్రూ మాడ్యూల్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు సోమనాథ్ ఆ పదవిలో లేనంత మాత్రాన గగన్‌యాన్ మిషన్ ఆగిపోయిందని అర్థం కాదు. అలా జరగదు కూడా. పైగా ఇస్రోలో పనులు నిరంతరాయంగా సాగుతాయి. పదవీవిరమణ చేసినవారు, మాజీ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులలో భాగస్వాములుగా కొనసాగుతారు. అక్కడ పని సంస్కృతి చాలా భిన్నంగా ఉంటుంది" అని జితేంద్ర సింగ్ అన్నారు.యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ , విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వంటి ఇస్రో కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సోమవారం జారీ చేసిన అంతర్గత మెమోలో కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్రతిష్టాత్మక మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్', ఇతర ముఖ్యమైన మిషన్లతో ముడిపడి ఉన్న గ్రూప్ 'ఎ' సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామాలను లేదా స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలను సాధారణ పద్ధతిలో ఆమోదించవద్దని ఆదేశించింది.

# పశ్చిమ్ బెంగాల్‌లో కలకలం

- జాతీయస్థాయి షూటింగ్ ట్రయల్స్‌కు ఎంపికైన బెంగాల్ టీనేజ్ షూటర్ మిస్సింగ్
- గురువారం మధ్యాహ్నం ఇంటికి సరకుల కోసం వెళ్లిన తిరిగి రాని మహిళా షూటర్
- హౌరా రైల్వే స్టేషన్‌లోని 4, 5 ప్లాట్‌ఫామ్‌లపై ఆమె కదలికలు

జయభేరి, పశ్చిమ్ బెంగాల్ :



ఇంటి నుంచి వెళ్లిన జాతీయస్థాయి మహిళా షూటర్ అదృశ్యమైన ఘటన పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. దమయంతి సేన్ అనే 15 ఏళ్ల టీనేజ్ షూటర్ హౌరాలోని తమ ఇంటి నుంచి గురువారం సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన ఇంటి కోసం సరుకులు తీసుకొచ్చేందుకు వెళ్లిన షూటర్ చివరిసారి హౌరా రైల్వే స్టేషన్‌లో కనిపించింది. ఆమె కోసం పశ్చిమ్ బెంగాల్ పోలీసులు గాలిస్తున్నారు. సెంట్రల్ హౌరాలోని ఉమచరణ్ భట్టాచార్య లైన్‌లో నివసించే దమయంతి సేన్, జాతీయ జట్టు ట్రయల్స్‌కు ఎంపికైంది. రాష్ట్ర షూటింగ్ వర్గాలలో చురుకుగా ఉండేది. గురువారం మధ్యాహ్నం ఇంటికి సామాన్లు కొనడానికి వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. స్నేహితులు, షూటింగ్ సహచరులు, బంధువులను ఆరాతీయగా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. చివరిసారిగా హౌరా స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లో ఆమె గురువారం నాలుగు, ఐదు ప్లాట్‌ఫారాల మధ్య తిరుగుతూ కనిపించింది. ఆమె కదలికలను నిర్ధారించుకోవడానికి ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇంటి నుంచి బయలుదేరినప్పుడు తన మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకెళ్లినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. నేషనల్ ట్రయల్స్‌కు ఎంపికైన తర్వాత, దమయంతి రోజూ ఉదయాన్నే లేచి ప్రాక్టీస్ చేస్తూ ఒక కఠినమైన దినచర్యను పాటించేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. ఇటీవల కుటుంబంలో ఎలాంటి విభేదాలు లేవని వారు చెప్పారు. "ఈరోజు ఉదయం 10 గంటలకు హౌరా స్టేషన్‌లోని 4, 5 నంబర్ ప్లాట్‌ఫారాలపై నా కుమార్తె దమయంతి సేన్ తిరుగుతున్న ఫుటేజ్ చూశాను.. ఆ తర్వాత నుంచి ఆమె జాడ కనిపించడం లేదు. గులాబీ రంగు టీషర్టు, ప్యాంటు ధరించి ఉంది. ఆమె ఆచూకీ తెలిస్తే దయచేసి మాకు సమాచారం ఇవ్వండి" అని దమయంతి తల్లి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి.. ఫోన్ నెంబరు షేర్ చేశారు. శుక్రవారం ఉదయం నుంచి ఆమె ఎక్కడుందో తెలియకపోవడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు, సహచర షూటర్లు ఆందోళన చెందుతున్నారు. షూటర్ మిస్సింగ్ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని, ఆమె జాడ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రముఖ ఒలింపియన్ జయ్‌దీప్ కర్మాకర్ షూటింగ్ అకాడమీలో ఆమె శిక్షణ పొందుతోంది. ఇటీవల జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన దమయంతి.. జాతీయ స్థాయి జూనియర్ షూటింగ్ స్క్వాడ్ ట్రయల్స్‌కు ఎంపికయ్యారు.

## బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి

నేడు సరూర్ నగర్ స్టేడియంలో జరిగే ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభకు అనుమతి దక్కింది. నిర్వాహకులు అనుమతి కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో, కొన్ని షరతులు విధిస్తూ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని.. హైవే పైన రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని స్పష్టం చేసింది. ఈ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 'యూత్ డిక్లరేషన్' హామీలను, ఉద్యోగాల కల్పనలో వారి వైఫల్యాలను నిలదీయడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ సభ నిర్వహణ కోసం బీఆర్ఎస్ నేతలు జూన్ 30నే పోలీసులకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. శాంతిభద్రతలు కారణంగా చూపుతూ పోలీసులు చివరి నిమిషంలో అనుమతిని నిరాకరించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే సభను అడ్డుకుంటోందని ఆరోపించిన బీఆర్ఎస్ లీగల్ సెల్ హైకోర్టును ఆశ్రయించింది. యువతకు ఇచ్చిన హామీలు.. ఉద్యోగాల పై చర్చ కాగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లోని హామీల అమలుపై ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ముఖ్యంగా మెగా డీఎస్సీ, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ప్రజలకు వివరించాలని పార్టీ భావిస్తోంది. ప్రత్యేకంగా, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీఆర్ఎస్ సదస్సు నిర్వహిస్తున్న ఇదే సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంకా గాంధీ సమక్షంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించిన విషయాన్ని బీఆర్ఎస్ నేతలు గుర్తు చేస్తున్నారు. అదే వేదికపై కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే కార్యాచరణను ప్రకటించాలని బీఆర్ఎస్ వ్యూహం సిద్ధం చేసింది. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై నిరుద్యోగ యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కాగా.. ఈ సదస్సు ద్వారా ప్రభుత్వం చెబుతున్న జాబ్ క్యాలెండర్లు.. ఉద్యోగాల నియామకాల పైన లెక్కలు వెల్లడించాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది.

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 70(3) సవరణకు కూడా తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీకి కాకుండా నేరుగా ఆయా గ్రామపంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక.. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూ కేటాయింపులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా ధరణి అక్రమాలపై సిట్ ఏర్పాటు నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసే అవకాశముండగా, ప్రభుత్వం తీసుకున్న ఇతర నిర్ణయాలు కూడా పరిపాలన, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమివ్వనున్నాయి.
ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి మంత్రిమండలి సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆందోళనకర పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవలసిన చర్యలపై మంత్రిమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజాభవన్‌లో ఒక టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ హెల్ప్ లైన్ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారు. **టోల్ ఫ్రీ నంబర్: 18001237157.** తీవ్ర వర్షాభావ పరిస్థితులపై పూర్తి వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదించి నష్టాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక బృందాన్ని పంపించాలని కోరాలని భావించింది. అలాగే, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని మంత్రిమండలి కేంద్రాన్ని కోరుతూ తీర్మానించింది. ఈరోజు వరకు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని, 30 నుంచి 35 శాతానికి మించి వర్షపాతం నమోదు కాలేదని మంత్రిమండలి ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ పరిస్థితుల్లో అవసరమైన చర్యలు తీసుకోవడానికి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించింది. విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించింది. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించింది. ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతాంగానికి మంత్రిమండలి విజ్ఞప్తి చేసింది. వర్షాభావ పరిస్థితులపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రితో పాటు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఈ నెల 20న జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలు అందరితో సమావేశాలు నిర్వహించి జిల్లాల వారిగా తలెత్తిన పరిస్థితులు, జరిగిన నష్టంపై సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని మంత్రిమండలి తీర్మానించింది. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కోఆప్టెడ్ సభ్యులుగా నామినేట్ చేసేందుకు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణకు సంబంధించి జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో ఈ నిధులను జమ చేసుకునేలా ప్రతిపాదించిన సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణకు మంత్రిమండలి ఆమోదం ముద్ర వేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 36వ మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

# తండా వాసుల సమస్యలు పరిష్కరిస్తాం

- మార్నింగ్ వాక్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 17 :**

బస్వాపూర్ ప్రాజెక్టు ద్వారా భూనిర్వాసితులుగా మిగిలిన లప్పానాయక్ తండా వాసుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్ తండా, రాళ్లజనగాం గ్రామాల్లో బీర్ల అయిలయ్య పర్యటించారు. సంప్రదాయ ఆహారం జొన్న రొట్టె సోలాయ్‌లో స్థానికులతో కలిసి బీర్ల అయిలయ్య సామూహికంగా అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



అనంతరం లప్పానాయక్ తండా వాసులకు దాతార్‌పల్లి గ్రామ సమీపంలో కేటాయించిన పునరావాస స్థలాన్ని బీర్ల అయిలయ్య పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ స్థలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి తాగునీటి సరఫరా, విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు తదితర మౌలిక వసతులపై అధికారుల సమీక్షించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ భూనిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో కూడిన నివాస ప్రాంతాన్ని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ఈ నెలలోనే ప్లాట్లను లప్పానాయక్ తండా వాసులకు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వారిని నీళ్లలో ముంచగా,ప్రజా ప్రభుత్వం వారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తూ అవసరమైన అన్ని పనులను వేగంగా పూర్తి చేస్తుందన్నారు. బస్వాపూర్ భూనిర్వాసితులను గత ప్రభుత్వం మోసం చేసిందని, కనీసం పరిహారం ఇవ్వకుండా పనులు మొదలు పెట్టి ఇబ్బంది పెట్టిందన్నారు. లప్పానాయక్ తండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. త్వరలో గంధమల్ల ప్రాజెక్టును పూర్తి చేస్తామని,రెండు, మూడు రోజుల్లో అక్కడి భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందిస్తామని తెలిపారు. అనంతరం రాళ్ల జనగాం, లప్పానాయక్ తండా గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బీర్ల అయిలయ్య ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం సంతోషకరమని, ప్రజల ఆరోగ్య రక్షణలో స్వచ్ఛమైన తాగునీరు కీలకమని,గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు,కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కల్పనకు హామీ

- దివ్యాంగుడు స్వామి నాయక్ ను సన్మానించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 17 :**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాకు చెందిన శారీరక వికలాంగుడు స్వామి నాయక్ ప్రతిభకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రశంసించారు. దేవరుప్పుల మండలం ధరావత్ తండాకు చెందిన శారీరక వికలాంగుడు స్వామి నాయక్ అసాధారణ ప్రతిభను యాదగిరిగుట్ట మండలంలోని లప్ప నాయక్ తండలో చూసి అబ్బురపడ్డారు. చేతులు లేకపోయినా, కాలి వేళ్ల సహాయంతో మొబైల్ ఫోన్ ను చాక చక్యంగా ఆపరేట్ చేయడంతో పాటు,అదే కాళ్ల వేళ్లతో తెల్ల కాగితంపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధన్యవాదాలు అని రాయడం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. స్వామి నాయక్ ప్రతిభను అభినందించిన బీర్ల ఐలయ్య జనగామ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఆయనకు అవసరమైన ప్రభుత్వ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి నాయక్‌ను శాలువాతో సన్మానించి,ఆయన ఆత్మ విశ్వాసం,పట్టుదలను బీర్ల అయిలయ్య ప్రశంసించారు.



## విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- టీజీ ఎస్ పిడిసిఎల్ సిఎండిని కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో శుక్రవారం టి జి ఎస్ పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్ ఆపరేషన్ అండ్ పర్చేస్ డైరెక్టర్ నర్సింలులను శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి(జిఎంఆర్) కలిశారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గంలో మంజూరైన సబ్ స్టేషన్ లకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని వారిని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. అలాగే నూతన సబ్ స్టేషన్ లనుమంజూరు చేయాలని, నియోజకవర్గానికి 500 ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయాలని వారిని ఎమ్మెల్యే కోరారు. అంతే కాకుండా ఏవి స్విచ్లు, స్తంభాలు, వైర్లు కూడ ఇవ్వాలని వారిని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. త్వరలో నియోజకవర్గానికి ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు తదితర విద్యుత్ ఉపకరణాలు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## ప్రభుత్వం హెల్త్ కార్డుల పంపిణీపై ఉపాధ్యాయ సంఘాల హర్షం

- పిఆర్ టియు మండల బాధ్యులు ఎర్ర పూర్ణచందర్



**జయభేరి, నర్సింహులపేట, జులై 17 :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కార్డుల పంపిణీపై మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది.శుక్రవారం పిఆర్టియు మండల బాధ్యులు ఎర్ర పూర్ణచందర్,ప్రధాన కార్యదర్శి కొండ సంజీవలు మాట్లాడుతూ.ప్రభుత్వం ఉద్యోగులకు హెల్త్ కార్డులు పంపిణీ చేయడం హర్షనేయమని కొనియాడారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఉపాధ్యాయ సంఘాల ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

## తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- యాదాద్రిలో వేసింది ట్రస్ట్ బోర్డు...ఇండస్ట్రియల్ బోర్డు : పాశం భాస్కర్

**జయభేరి, యాదగిరిగుట్ట:**




తెలంగాణలో బీజేపీ రోజు రోజుకు విస్తరిస్తోందని, వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని జిజేపి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యవర్గం సమావేశంలో కర్రె ప్రవీణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా ఇచ్చిన హామీలు మర్చిపోయి వర్గాల కుమ్ములాటల పార్టీగా మారిపోయిందన్నారు. రైతులు హరిగోస పడుతున్నా వారిని పట్టించుకోకుండా రైతులను కోసి రక్తాన్ని పంట పొలాల్లో చల్లాలంటున్నదౌర్భాగ్యమైనసీఎం మన రేవంత్ రెడ్డి మాత్రమేనని విమర్శించారు. యాదాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డులో కూడా స్థానికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అది ట్రస్ట్ బోర్డులా కాకుండా ఇండస్ట్రియల్ బోర్డు లాగా ఉందని ఎద్దేవా చేశారు. చట్టం చూపుగా వచ్చి పోయే బోర్డు మాకు ఎందుకు అని, నిత్యం ఇక్కడ ఉండి భక్తులను పర్యవేక్షించే చైర్మన్‌ను నియమించాలన్నారు. ఆలయం అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిజేపి నేతలు ఆకుల చంద్రమౌళి, భువనగిరి శ్యాం సుందర్, అశోక్, మల్లేష్, నరేష్, పలుగుల సురేష్, ఆలేటి కర్ణ, మిర్యాల కృష్ణ,జాగిని నవీన్, చిత్తర్ల కృష్ణ, లెంకలపల్లి శ్రీనివాస్, బోడ సురేష్,ఆరుట్ల స్వాతి, మంజుల,ఆవుల సత్యం,దొమ్మట ప్రభాకర్, బోడ బుచ్చిబాబు, సుదగాని శివ, వాల్మీకి అజయ్, మెరుగు వెంకటేష్, వినోద్, నరేష్, రమేష్, శ్రీకర్, దేవేందర్, వంశీ, శ్రీశైలం, నవీన్, ప్రవీణ్, శ్రీకాంత్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఇష్టానుసారంగా పార్కింగ్

- విద్యార్థులు, ఉద్యోగులకు తప్పని ఇక్కట్లు
- ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ పట్టణంలోని చంద్రనగర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువుల వాహనాలకు యాజమాన్యం తగిన పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో కార్లు, బైకులు రోడ్డుపైనే ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. దీంతో స్థానికులు, పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ఇప్పటికే ఆ ప్రాంతంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీనికి తోడు రోడ్డుపై పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత పెరిగి వాహనాలు నిలిచిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చంద్రనగర్ కాలనీకి వెళ్లే రహదారి ఒకవైపు పూర్తిగా వాహనాలతో ఆక్రమించబడుతుండటంతో పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. చిన్నారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను పరామర్శించేందుకు వచ్చే బంధువులు, స్నేహితులు కూడా వాహనాలు నిలిపేందుకు స్థలం లేక చుట్టుపక్కల వీధుల్లో తిరగాల్సి వస్తోంది. కొందరు దూరంగా వాహనాలు పార్క్ చేసి నడుచుకుంటూ ఆసుపత్రికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇప్పటికైనా ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి రోడ్డుపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని చంద్రనగర్ వాసులు కోరుతున్నారు. అలాగే ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేసే సమయంలో పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసుపత్రి వద్ద రోడ్డుపై జరుగుతున్న అక్రమ పార్కింగ్‌ను అరికట్టి, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని చంద్రనగర్ వాసులు కోరుతున్నారు. రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయడంతో పాటు ఆసుపత్రి యాజమాన్యంతో సమన్వయం చేసి పార్కింగ్ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడే సభగా 'యువ సంగ్రామ సభ'

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి
- జూలై 18న హైదరాబాద్‌లో జరిగే కేటీఆర్ సభను విజయవంతం చేయాలని పిలుపు

**జయభేరి, మేడ్చల్ :**



కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడే సభగా 'యువ సంగ్రామ సభ' ఉండబోతుందని, ప్రజలు కేసీఆర్ అభివృద్ధి పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో జూలై 18న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సభ"ను పార్టీ శ్రేణులు, యువత, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మద్దుల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, పరిపాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఆరోపించారు. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధించిందని, రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ చూపిన దూరదృష్టి, పరిపాలనా సామర్థ్యాన్ని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ, యువత సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభ చారిత్రాత్మకంగా నిలవాలని ఆకాంక్షించారు. మేడ్చల్ జిల్లా సహా రాష్ట్రం నలుమూలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మద్దుల శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో వర్షాలు సమృద్ధి కురవాలి

- కేసీఆర్ సంకల్పంతోనే యాదాద్రి అభివృద్ధి : మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 17 :**

వర్షాలు సమృద్ధిగా కురిసి తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని మొక్కుకున్నట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభావంతో వర్షాలు లేక రైతాంగం,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దయతో వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని,ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని పూర్వం గ్రామాలు, మండలాలు, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి దర్శించుకునే వారని, మాజీ సీఎం కేసీఆర్ మహా సంకల్పంతో యాదాద్రి ఆలయ అభివృద్ధి మహాద్భుతంగా జరిగిందన్నారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రపంచంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారని, యాదాద్రి ఆలయ ఖ్యాతి ప్రపంచ స్థాయికి చేరుకుందని తెలిపారు. ఆయన వెంట ఆయన అనుచరులు, ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు కీలకం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 17 :**

గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాలు సమర్థవంతంగా పనిచేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని, ఆలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని గ్రామ సర్పంచ్‌కు సూచించారు. అనంతరం సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి..

**జయభేరి, హైదరాబాద్, జూలై 17 :**

హైదరాబాద్‌లోని కుల్సుంపురలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో స్థానికులు దాడి చేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని డబుల్ బెడ్రూం సముదాయంలో నివాసముండే అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి, నిలోఫర్ ఆసుపత్రి వద్ద టీ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివసించే 9 ఏళ్ల బాలిక పట్ల ఇటీవల అతను అనుచితంగా ప్రవర్తించాడు. బాలికకు ముద్దులు పెట్టి, ఆమె ప్రైవేట్ భాగాలను తాకినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో అది చూసిన బాలిక కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆవేశంతో అజీజ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి అజీజ్ మృతిచెందాడు.ఈ ఘటనపై కుల్సుంపుర పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడికి పాల్పడిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.



## మురికి నీటిని వెంటనే తొలగించాలి

- మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు ముదిరాజ్

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ బస్ డిపో ప్రాంగణంలో పేరుకుపోయిన మురికి నీటిని వెంటనే తొలగించి, ప్రయాణికులను అంటువ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు ముదిరాజ్ సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం ఆమె మేడ్చల్ బస్ డిపోను సందర్శించి అక్కడ నెలకొన్న పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కారణంగా డిపో ఆవరణలో మురికి నీరు నిల్వ ఉండడంతో దోమలు, క్రిమికీటకాలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య లోపం కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించి నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించి బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ వంటి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఉమానాగరాజు ముదిరాజ్ కోరారు.

## ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**జయభేరి, తుర్కపల్లి, జూలై 17 :**

తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని, ఓ హెచ్ఎస్ఆర్ బ్యాంకు ను జిల్లా లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గ్రామంలో గల ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంకు శిథిలావస్థలో ఉందని కొత్త ట్యాంకు మంజూరు చేయాలని సర్పంచ్ సొన్నాయిల రఘు అడిషనల్ కలెక్టర్ ను కోరారు. గ్రామంలో డ్రైనేజ్, అండ్ వర్టికల్ సోక్ ఫీట్ నిర్మాణం చేయుట కోసం స్థలం గురించి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారితో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఉప సర్పంచ్ ఆకుల బాలయ్య, వార్డు సభ్యులు సొల్లేటి రాజు, తోడేటి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం 20 వేలు ఇవ్వాలి



**జయభేరి, తుర్కపల్లి, జూలై 15 :**

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం 20 వేల రూపాయలను ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కరరావుకు మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తూ గ్రామ గ్రామాన ప్రజలకు మంచినీరు అందిస్తున్న కార్మికులకు కనీస వేతనం 10000 కూడా దాటడం లేదని విమర్శించారు. కార్మికులు ఏ విధంగా కుటుంబాన్ని పోషణ చేయగలరని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం 20వేల రూపాయలు ఇచ్చే విధంగా చూడాలని జెయింట్ కలెక్టర్ ను కోరినట్టు తెలిపారు. ఈ సమస్య నమస్కారానికి జూలై 27న ఎస్ ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, మండల కన్వీనర్ తూటి వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఒగ్గు బాలరాజు, కుమారస్వామి, కృష్ణ, కోశాధికారి ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శులు సంపత్ కుమార్, పంబెరి ఉపేందర్, జంగయ్య, రమేష్, సత్యనారాయణ, శ్రీను, అశోక్, కర్ణాకర్, మహేష్, పాల్గొన్నారు.

## జిల్లాలోని ఆదర్శ పీఏసీఎస్ గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం



**జయభేరి, తుర్కపల్లి, జూలై 17 :**

జిల్లాలోనే తుర్కపల్లి మండల పిఎసిఎస్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన మొదటి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విధాలుగా సొసైటీ ని అభివృద్ధి చేస్తామని, రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ నాగార్జున, ఎడిసిఓ రామ నరసయ్య, ఎఫ్పిఓ మహేశ్వరి, సెక్రెటరీ నారా రమేష్, బోరెడ్డి జనార్దన్ రెడ్డి, డైరెక్టర్లు డైరెక్టర్లు పాముల రాజు, మోత్కుపల్లి రవి, బానోతు వినోద్, జాగిల్లపురం సతీష్, గుగులోతు హనుమంతు నాయక్, పనగట్ల సుదర్శన్ గౌడ్, ఒగ్గు బిక్షపతి, వంగ నారాయణరెడ్డి, సింగం శ్రీనివాస్, సదల లత, రామ గౌని మహేష్ కుమార్, లక్ష్మి,సిబ్బంది లక్ష్మణ్, స్వామి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# నిర్వహణ లేక.. నిరుపయోగంగా మరుగుదొడ్లు

- గుండ్లపోచంపల్లిలో పబ్లిక్ టాయిలెట్స్‌కు తాళం
- నీటి సరఫరా లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు






**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌లో ప్రజల సౌకర్యార్థం లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పబ్లిక్ మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో పూర్తిగా నిరుపయోగంగా మారాయి. నీటి సరఫరా నిలిచిపోవడంతో గత రెండు నుంచి మూడు నెలలుగా మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచడం వల్ల స్థానికులతో పాటు వివిధ పనుల నిమిత్తం గుండ్లపోచంపల్లికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ వందలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతంలో ప్రజా మరుగుదొడ్లు మూసివేయడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు కనీస అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో కొందరు బహిరంగ ప్రదేశాల్లోనే మల, మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో పారిశుద్ధ్య సమస్యలతో పాటు ప్రజారోగ్యానికి కూడా ముప్పు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జనకు దూరంగా ఉండాలని, స్వచ్ఛతను పాటించాలని అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోవైపు ప్రజలకు అవసరమైన పబ్లిక్ మరుగుదొడ్ల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రజా సౌకర్యాలు నిర్వహణ లేక మూతపడడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం మరుగుదొడ్లకు నీటిని సరఫరా చేసే మోటారు చెడిపోయి నెలలు గడిచినా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. చిన్నపాటి మరమ్మతులతో పరిష్కారమయ్యే సమస్యను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. గతంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలపై అధికారులు త్వరితగతిన స్పందించి పరిష్కారాలు చూపేవారని, జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత ప్రజా సౌకర్యాల నిర్వహణ, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం పెరిగిందని స్థానికులు పేర్కొన్నారు. రోజువారీ నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పబ్లిక్ మరుగుదొడ్లకు తక్షణమే నీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు మోటారును మరమ్మతు చేసి, పారిశుద్ధ్య నిర్వహణను క్రమబద్ధీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విశాఖ ఫార్మాసిటీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనం ప్రారంభం

**జయభేరి, పరవాడ:**



విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడి గ్రామంలో నిర్మించిన స్మశాన వాటిక మరియు ఆధునికరణ కమ్యూనిటీ భవనాన్ని శుక్రవారం గ్రామ ప్రజలకు అధికారికంగా అందజేశారు.ఈ సందర్భంగా రామ్ కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె. శ్రీకాంత్ మాట్లాడుతూ విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ సహకారంతో పరిసర గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రామ్ కీ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో భవిష్యత్తులో కూడా మరిన్ని సామాజిక బాధ్యత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మండల అధ్యక్షుడు మాదంశెట్టి నీలబాబు మాట్లాడుతూ స్మశాన వాటికలో షెడ్డు లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. ప్రస్తుతం షెడ్డు నిర్మించి కమ్యూనిటీ భవనాన్ని ఆధునికరించడం ద్వారా గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి స్మశాన వాటిక ఆధునికరణ పనులను పూర్తి చేసిన విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్, రామ్ కీ ఫౌండేషన్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గని రెడ్డి కనకరాజు, కోమటి అచ్చుబాబు, గొల్లవి లచ్చిబాబు, జుత్తిక మాధవరావు, మాధవ్ శెట్టి సూరిబాబు, గుమ్మల రాము, బంతికోరి గోవిందు, గుర్రం నూకరాజు తదితర గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన చుక్కా

- కార్యక్రమంలో పాల్గొన్న వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు

**జయభేరి, పరవాడ:**



ఇటీవల ప్రకటించిన వైస్సార్సీపీ అనకాపల్లి జిల్లా కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు గాను పరవాడ మాజీ సర్పంచ్, వైస్సార్సీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి చుక్కా రాము నాయుడు శుక్రవారం గాజువాక మిందిలో మాజీ మంత్రి,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్ నాథ్ ని వారి స్వగృహం నందు వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గం పరిశీలుకులు పైల శ్రీనివాసరావుతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా చుక్కా రాము నాయుడు మాట్లాడుతూ ఇటీవల తనకు వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అందులో భాగంగానే ఈ మర్యాదపూర్వక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని, నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు వైస్సార్సీపీ రాష్ట్ర SEC సభ్యులు కోడిగుడ్ల దేవి సాంబ, జీవీఎంసీ వైస్సార్సీపీ నాయుకులు మద్ది శ్రీను, మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరావు,పెందుర్తి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్,మండల వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు కోన రామారావు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, వైస్సార్సీపీ నాయుకులు గండి రామకృష్ణ, పరవాడ జగదీష్, గండి చంద్రరావు,కసిరెడ్డి అప్పలరాజు, బండారు శ్రీనువాసరావు, ములకలపల్లి రమణ తదితర పరవాడ మండల వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.


## నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలి

- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**జయభేరి, పీఏ పల్లి :**



పీఏ పల్లి, గుడిపల్లి మండలాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పీఏ పల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి మండలాలైన పీఏ పల్లి, గుడిపల్లిలో విద్యుత్ కోతలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు వరి నాట్లు వేస్తున్న కీలక సమయంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. అలాగే తాగునీటి అవసరాలు కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. రైతుల సాగు, ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆయన కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో ఉమ్మడి మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడించే కార్యక్రమాన్ని చేపడతామని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి

- నిరుద్యోగులు తలుచుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది
- పల్లె విడిచి పట్నం కోచింగ్ సెంటర్లలో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ
- 20 వేల పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి
- నిరుద్యోగులకు అండగా తెలంగాణ రక్షణ సేన పార్టీ
- తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్

**జయభేరి, షాద్ నగర్, జులై 17 :**

నిరుద్యోగుల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి చూపిస్తుందని తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉమాదేవి ముదిరాజ్ కురుమ మాట్లాడుతూ.... తలుచుకుంటే పార్టీలు ఊసు లేకుండా పాతాలోనికి పోవడం ఖాయమని అది గత ప్రభుత్వంలోనే నిరుద్యోగులు నిరూపించారని రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తు చేశారు. కాంగ్రెస్ అబద్ధాల హామీతో నిరుద్యోగుకు మోసం... నిరుద్యోగులు తలుచుకుంటే రాష్ట్ర ప్రభుత్వం కూలిపోవడం ఖాయం... పల్లె విడిచి పట్టణంలో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ చేస్తున్నారు.. అబద్ధాల హామీలతో ఏ రాజకీయ పార్టీ కూడా నిలవదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి సకాలంలో ఖాళీగా ఉన్న అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగుల పట్ల మొండి వైఖరి చూపడం రాష్ట్ర ప్రభుత్వానికి నష్టమని అన్నారు. ఆకలి కేకలతో తిండి తిప్పలు లేక ఒక పూట తిని ఒక పూట పస్తులు ఉండి హాస్టల్లో, స్టడీ హాల్లో విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడిన కష్టం వృధా కావడం జరుగుతుందని, తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందని నిరుద్యోగులు ఎన్నో ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి వినదులు చేసిన పట్టించుకోవడంలేదని, ఇదే మొండి వైఖరి రాష్ట్ర ప్రభుత్వం వహిస్తే తమ పార్టీ చూస్తూ ఊరుకోదని నిరుద్యోగులకు అండగా తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె హెచ్చరించారు.

## మద్దులపల్లిలో వైద్య శిబిరం

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో గ్రామస్తులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సర్పంచ్ సరిత గ్రామస్తులకు సూచించారు.

# రోడ్డు విస్తరణ పేరుతో వ్యాపారులను వేధించడం ఆపాలి

- గాజుల నిరంజన్, బీజేపి పట్టణ శాఖ అధ్యక్షులు
- పునరావాసం కల్పించిన తర్వాతే చర్యలు చేపట్టాలి




**జయభేరి, పరకాల, జులై 17:**

పరకాల పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల పేరుతో దశాబ్దాలుగా జీవనోపాధి సాగిస్తున్న చిరు వ్యాపారులను ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించే ప్రయత్నాలు చేయడం అమానవీయమని బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బిజెపి పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో పరకాల మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించి, వ్యాపారుల సమస్యలను వివరించారు. గత 30-40 సంవత్సరాలుగా రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వ్యాపారులను ముందస్తు నోటీసులు, ప్రత్యామ్నాయ స్థలాలు లేకుండా తొలగించడం అన్యాయమని అన్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో పరకాలను జిల్లాగా ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికే పట్టణంలోని వ్యాపార కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోయాయని, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల రాకపోకలు తగ్గడం వల్ల వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రోడ్డు విస్తరణ పేరుతో చిరు వ్యాపారులను తొలగించడం వారి కుటుంబాలను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే చర్యగా అభివర్ణించారు. అభివృద్ధి పనులకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల జీవనోపాధిని దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. రోడ్డు విస్తరణ వల్ల ప్రభావితమయ్యే ప్రతి వ్యాపారికి ముందుగా తగిన పునరావాసం, ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాలు కల్పించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, వ్యాపారుల సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని రూపొందించాలని, వ్యాపారుల హక్కులను పరిరక్షిస్తూ వారి జీవనోపాధికి ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పునరావాసం కల్పించకుండా బలవంతంగా వ్యాపారులను తొలగించే ప్రయత్నాలు కొనసాగితే, బీజేపీ పరకాల పట్టణ శాఖ వ్యాపారులకు అండగా నిలిచి ప్రజాస్వామ్యబద్ధంగా తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేపడుతుందనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిలు జయంతీ లాల్, దేవునూరి మేఘనాథ్, బిజెపి పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, బెజ్జంకి పూర్ణ చారి, ఆకుల లావణ్య శ్రీధర్, పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, రాష్ట్ర నాయకులు కాచం గురు ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



## వేములపల్లిలో బాలవికాస ఉచిత వైద్య శిబిరం

- బాలవికాస ఆధ్వర్యంలో మెడికేర్ హాస్పిటల్ సౌజన్యంతో.

**జయభేరి, దంతాలపల్లి, జూలై 17 :**

మండలంలోని వేములపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో మేడికే హాస్పిటల్ సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ గుమ్మడవెల్లి రవి మాట్లాడుతూ మా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం బాలవికాస వారు నిర్వహించడం చాలా బాగుందన్నారు. ప్రస్తుతం మా గ్రామంలో జ్వరాలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి మంచి సమయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. హాస్పిటల్ వారి వైద్య సదుపాయాలను అభినందించారు. మెడికల్ హాస్పిటల్ కిరణ్ గారు మెడికల్ హాస్పిటల్ వారి యొక్క సదుపాయాల గురించి ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గురించి అవగాహన కల్పించడం జరిగింది. వ్యాధుల గురించి పరిసరాల పరిశుభ్రత గురించి వాతావరణ కాలుష్యం ,అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధుల గురించి వివరించడం జరిగింది .మరియు హాస్పటల్ యొక్క సేవల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవి కార్యదర్శి మురళి వార్డ్ మెంబర్లు గ్రామపంచాయతీ సిబ్బంది పంతం వెంకట వీరయ్య అశోకు,, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.





## పరవాడ బీసీ వెల్ఫేర్ హాస్టల్ మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

మహిళలు బాలికల భద్రతపై అవగాహన కల్పించేందుకు అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన అభయ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో పరవాడ ఇన్‌స్పెక్టర్ లంక భాస్కరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 90 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళలు, బాలికలపై జరిగే నేరాలు,ఈవ్ టీజింగ్, స్టాకింగ్, లైంగిక వేధింపులు, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సోషల్ మీడియా వేధింపులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించవద్దని, వ్యక్తిగత ఫోటోలు, ఓటీపీ , పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఫేక్ అకౌంట్లు, ఫోటో మార్ఫింగ్, బ్లాక్‌మెయిలింగ్ లేదా ఇతర సైబర్ వేధింపులకు గురైతే మౌనంగా ఉండకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో 112, ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్, 181 ,మహిళా హెల్ప్‌లైన్ 1098, చైల్డ్ హెల్ప్‌లైన్ 1930 ,సైబర్ ఆర్థిక మోసాల హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని విద్యార్థినులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ లాయర్లకు సన్మానం



**జయభేరి, దేవరకొండ :**

ఇంటర్నేషనల్ లాయర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ నుండి లాయర్ వనం జగదీశ్వర్, లాయర్ నామని చంద్రశేఖర్ గార్లకు సన్మానంచేయడం జరిగినది. ఈ సందర్భంగా వారికి జరిగిన సన్మానానికి ఆనందం వ్యక్తం చేశారు. దేశ పునాదికి మూల స్తంభాలలోఒకటైన న్యాయవ్యవస్థ పకడ్బందీగా ఉన్నప్పుడే దేశంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటాయి. అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. అటువంటి న్యాయవ్యవస్థను కాపాడే వారే లాయర్లు వారిని సన్మానించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామని అధ్యక్షులు Ln గుద్దేటి జంగయ్య, ప్రధాన కార్యదర్శి Ln కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, కోశాధికారి Ln చిలుకూరి కాశీనాథ్ లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో Ln గాజుల రాజేష్, past జోన్ చైర్మన్ వనం శ్రీనివాసులు, ఫాస్ట్ ప్రధాన కార్యదర్శి లకుమారపు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# SIR ప్రక్రియలో జరిగిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

- పంబాల పర్వతాలు

**జయభేరి, నేరేడు గోమ్ము :**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)2026 కార్యక్రమంలో భాగంగా, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచనల మేరకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్, నేరేడుగొమ్ము క్లస్టర్ కోఆర్డినేటర్ గిరి యాదయ్య పర్యవేక్షణలో నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామం పోలింగ్ కేంద్రం నెం. 202లో ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, నేడు మండల తహసీల్దార్ ఉమాదేవితో కాంగ్రెస్ పార్టీ BLA పంబాల పర్వతాలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ఎదురైన సాంకేతిక సమస్యలు, కొన్ని చోట్ల నమోదైన వివరాల్లో జరిగిన పొరపాట్లు, ఓటర్ల వివరాల్లో తలెత్తిన వ్యత్యాసాలను MRO దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యల కారణంగా అర్హులైన ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, నమోదైన తప్పులను వెంటనే సరిదిద్దాలని, ప్రతి ఓటరి ఓటు హక్కు పరిరక్షించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పంబాల పర్వతాలు కోరారు. దీనిపై స్పందించిన MRO ఉమాదేవి గారు, ఓటర్ల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సాంకేతిక లోపాలు మరియు నమోదులో జరిగిన పొరపాట్లను నిబంధనల ప్రకారం సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు సరైన వివరాలతో ఓటరు జాబితాలో ఉండేలా అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా పంబాల పర్వతాలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలి

**జయభేరి, మేడిపల్లి :**



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ వార్డుల్లో కొనసాగుతున్న SIR (సంక్షిప్త ఓటర్ సవరణ) కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా SIR నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలపై BLOలు, బీఆర్ఎస్ పార్టీ BLAలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్ మాజీ అధ్యక్షుడు యాసారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్వతాపూర్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన SIR ఎన్‌రోల్‌మెంట్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. వాలంటీర్లతో కలిసి దరఖాస్తు ఫారాలు పూరించే కార్యక్రమంలో పాల్గొని, ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు SIR ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. SIR ప్రక్రియలో డిక్లరేషన్ సమర్పించని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు నిర్దేశిత గడువులోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, వివిధ డివిజన్ల మాజీ అధ్యక్షులు కోనేటి వెంకట్, మునికుంట్ల కిరణ్ గౌడ్, 3వ డివిజన్ మాజీ జనరల్ సెక్రటరీ పింగళి జోగిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సతీష్, అమర్ పటేల్, లారెన్స్, సురేష్, కిషోర్, జోగిరెడ్డి, బి. మహేష్, రఘు, బి. శివ, లింగస్వామి, వై. ప్రభాకర్, రాజు, రాజీవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సదస్సుకు తరలిరండి..!

- యువతకు పిలుపునిచ్చిన బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం మాజీ అధ్యక్షుడు ఫైళ్ల ప్రభాకర్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే "యువ సంగ్రామ సదస్సు" కు యువత భారీ సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం మాజీ అధ్యక్షుడు ఫైళ్ల ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఎన్నికల హామీల పేరుతో మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. "యూత్ డిక్లరేషన్" పేరుతో నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ క్యాలెండర్, ఖాళీ పోస్టుల భర్తీ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందడం లేదని, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉందన్నారు. అదే విధంగా రైతులకు ₹2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు నెలకు ₹2,500 ఆర్థిక సాయం, మహాలక్ష్మి పథకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గృహ జ్యోతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిక్లరేషన్‌లలో ఇచ్చిన హామీలు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కార్మికుల సంక్షేమానికి ప్రకటించిన పథకాల అమలులో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్క వర్గానికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలు ప్రజా వ్యతిరేకంగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. జూలై 18న సరూర్‌నగర్‌లో జరిగే యువ సంగ్రామ సదస్సులో యువత భారీ ఎత్తున పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అలాగే యువజన సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని, అలాంటి ప్రయత్నాలను నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఎదుర్కొని సభను విజయవంతం చేయాలని ఫైళ్ల ప్రభాకర్ రెడ్డి కోరారు.

## సెల్ టవర్ బ్యాటరీల దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సెల్ టవర్ బ్యాటరీల దొంగతనం కేసును పరవాడ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారంపై తాడి మూడు మధుములు జంక్షన్, జాతీయ రహదారి16 వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో టాటా ఏస్ వాహనం లో వెళ్తున్న ముగ్గురు నిందూతలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు ఆదివారం రాత్రి ఫార్మాసిటీలోని ఇండస్ (ఐడియా) సెల్ టవర్ తాళం పగులగొట్టి అందులో ఉన్న 46 అమర్‌రాజా బ్యాటరీ సెల్‌స్‌ను దొంగిలించి, వాటిని తాడి-ఏలేరు కాలువ సమీపంలోని పొదల్లో దాచిపెట్టి గురువారం విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల వద్ద నుండి 46 అమర్‌రాజా బ్యాటరీ సెల్స్, దొంగతనానికి ఉపయోగించిన టాటా ఏస్ వాహనం మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మూడవ నిందితుడు దువ్వ అసిరి నాయుడు గతంలో శ్రీకాకుళం జిల్లా పరిధిలో నమోదైన దొంగతనం కేసుల్లో పాత నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించాడు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించబడింది. కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు పరవాడ పోలీసులు కొనసాగిస్తున్నారు.


## అమ్మవారికి మంగళహారతులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మహిళా మణులు ప్రతి శుక్రవారం అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఆషాడ మాసం తొలి శుక్రవారం వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆర్య వైశ్య మహిళ మణులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మంగళహారతులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించినారు.

## SIR ప్రక్రియలో ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాల నమోదు



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలంలోని తీదేడు గ్రామంలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న SIR కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సిమర్ల శ్రీను యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు SIR నమోదు ప్రాముఖ్యతను వివరించి,అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, గ్రామ ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా SIR ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్నికల అధికారులకు అవసరమైన సహకారం అందించాలని గ్రామస్తులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తీదేడు గ్రామ పాలన అధికారి బుషిపాక యాదయ్య,బి.ఎల్.ఓ అంజమ్మ, చింతకుంట్ల రాకేష్ తదితరులున్నారు.

# పెళ్లిపైనా ఫుల్ క్లారిటీ!



కెరీర్ మొదలుపెట్టి పుష్కరం దాటిపోయింది. కావాల్సినంత డబ్బులు, రావాల్సినంత పేరు వచ్చేసాయి.. అయినా కూడా ఇప్పటికీ పిచ్చి పిచ్చి సినిమాలెందుకు చేయడం అంటున్నారు ఓ హీరోయిన్. వయసైపోతోందని ఏది పడితే అది చేయకుండా.. కెరీర్‌పై ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. క్వాంటిటీ కాదు క్వాలిటీయే ముఖ్యం అంటున్నారామె. మరి ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మ..? పుష్కరం కింద నేనొక్కడినేతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన బ్యూటీ కృతి సనన్.. ఆ తర్వాత హిందీలో టాప్ హీరోయిన్‌గా మారిపోయారు. అప్పట్లో ఖాళీగా ఉండకూడదని ఏ ఛాన్స్ వస్తే అది చేసుకుంటూ వెళ్లిన ఈ భామ.. ఇప్పుడు మాత్రం కథ నచ్చితేనే డేట్స్ ఇస్తానంటూ గట్టిగా చెబుతున్నారు. బాలీవుడ్‌లో తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ సొంతం చేసుకుని కాన్ఫిడెంట్‌గా దూసుకుపోతున్నారీమే. వచ్చిన ప్రతి సినిమాను ఒకే చేసే రోజులకి గుడ్‌బై చెప్పేసిన ఈ బ్యూటీ.. ఇప్పుడు రూట్ మార్చి క్వాలిటీకే ఓటేస్తోంది. తనకు నిజంగా కిక్ ఇచ్చే కథలనే ఎంచుకుంటూ.. రిజల్ట్ గురించి టెన్షన్ పడకుండా బిందాస్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం తన కెరీర్, లైఫ్‌లో ఎక్సైటింగ్ ఫేజ్ నడుస్తోందని తెలిపారీమే. ఇక్కడి దాకా వచ్చినందుకు ఎంతో హ్యాపీగా ఉందని ఫుల్ జోష్‌లో చెప్తున్నారు కృతి. పర్సనల్ లైఫ్‌లోనూ కృతిసనన్ తీసుకున్న ఓ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు. వయసైపోతుందేమో, త్వరగా పెళ్లి చేసుకోవాలేమో అనే టెన్షన్ లేకుండా.. కెరీర్‌పై ఫోకస్ చేయడానికే ఎగ్స్ ఫ్రీజ్ చేయించుకున్నట్లు ఓపెన్‌గా చెప్పారు. ఏ ప్రెషర్ లేకుండా ఫుల్ ఫ్రీడమ్‌తో కెరీర్‌ను ఎంజాయ్ చేస్తున్నారీమే. మొత్తానికి ఈ టైమ్‌లో తనకు క్వాంటిటీ కాదు కథల్లో క్వాలిటీ కావాలంటున్నారు కృతి.



# ఈసారి కథ మారింది!

అగ్ర హీరో రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. దాదాపు గత ఏడాదిగా ఈ సినిమాపైనే దృష్టి పెట్టారు రామ్‌చరణ్. 'పెద్ది' హంగామా ముగియడంతో సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయబోయే తదుపరి సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా లాంచింగ్ డేట్, ఇది ఏ జోనర్ కథాంశమనే విషయాలపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్‌ను దర్శకుడు సుకుమార్ లాక్ చేశారని సమాచారం. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది 'రంగస్థలం' తరహా రూరల్ డ్రామా కాదని, రామ్‌చరణ్ కోసం దర్శకుడు సుకుమార్ ఈసారి సరికొత్త కథను సిద్ధం చేశారని, నగర నేపథ్యంలో స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందనుంది.

# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?



'కేజీఎఫ్'తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. 'హనుమాన్' విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో 'జై హనుమాన్'ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.



# గణిత మేధావి ముని మనవరాలు..

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చాలా ఏళ్ల క్రితమే ఈ లోకం విడిచి వెళ్లిపోయారు. అయినా ప్రతి పాఠశాలలో ఆయన చిత్ర పటం కనిపిస్తుంది. గణిత శాస్త్రానికి సంబంధించి ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలే నేటికి ప్రామాణికంగా ఉండడం విశేషం. ఈ గణిత మేధావి ఫ్యామిలీకి చెందిన ఒకామె ఇప్పుడు దక్షిణాదిలో క్రేజీ హీరోయిన్ గా రాణిస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో వరుసగా సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ రేసులో జెట్ స్పీడ్ లో దూసుకెళుతోంది. అన్నట్లు ఈ తమిళ బ్యూటీ కోలీవుడ్ లో కంటే తెలుగులోనే ఎక్కువగా సినిమాలు చేసింది. సినిమా కూడా బ్లాక్ బస్టర్ అయ్యింది. ప్రస్తుతం నెట్టింట తెగ ట్రెండ్ అవుతోన్న ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు కన్నప్ప హీరోయిన్ ప్రీతి ముకుందన్. ఓం భీమ్ బుష్ సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించిన ప్రీతి మొదటి సినిమా తోనే సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత కన్నప్ప సినిమాలో గ్లామరస్ రోల్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక రీసెంట్ గా ప్రీతి నటించిన బ్లాస్ట్ సినిమా ఏ రేంజ్ లో పేలిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా తమిళనాడులోని తిరుచ్చిలో ఉన్న రామానుజన్ రోడ్ లో జన్మించిన ప్రీతి ముకుందన్, శ్రీనివాస రామానుజన్ కి మునిమనవరాలు అవతుందట. ప్రీతి ముకుందన్ అమ్మ తరపు నుంచి ఈ సంబంధం కలుస్తుందట. అంటే ప్రీతి ముకుందన్ కి శ్రీనివాస రామానుజన్ ముత్తాత అవుతారన్న మాట. రామనుజనే కాదు...'గిటార్'లో ప్రావీణ్యం సంపాదించి మంచి పేరు తెచ్చుకున్న ప్రఖ్యాత మ్యూజిషియన్ 'గిటార్ ప్రసన్న' కూడా ప్రీతి ముకుందన్ కు మేనమామ అవుతారట.

# "కళ్యాణం కమనీయం జీవితం" మూవీ టీజర్ లాంచ్



వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్స్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకులు వీఎన్ ఆదిత్య, రాంప్రసాద్, నిర్మాత మల్లిడి సత్యన్నారాయణ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ సాహితి అవంచ మాట్లాడుతూ "కళ్యాణం కమనీయం జీవితం" ఒక బ్యూటిఫుల్ ఫిలిం. అంతా ఫ్రెష్ టీమ్ ఈ మూవీకి వర్క్ చేశారు. ఆర్టిస్టులు కూడా చాలా మంది న్యూ యంగ్ టాలెంట్ నటించారు. మా సినిమా ప్లెజెంట్ గా ఉంటూనే చివరలో ఒక మంచి ట్విస్ట్ తో ఆకట్టుకుంటుంది. మా కొత్త టీమ్ చేసిన ఈ సినిమాను మీరు సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం. అన్నారు.

హీరో ఖాన్ దురాని మాట్లాడుతూ మా ప్రొడ్యూసర్స్ గతంలో కొన్ని మంచి మూవీస్ చేశారు. నేను హీరోగా కొత్తవాడినైనా ఈ చిత్రంలో అవకాశం కల్పించారు. మా మూవీ టీజర్, సాంగ్స్ చూశారు కదా. మీ అందరికీ నచ్చాయని నమ్ముతున్నాం. సినిమాలో మొత్తం నాలుగు సాంగ్స్ ఉంటాయి. శ్రీ మురళి మా మూవీకి మంచి మ్యూజిక్ ఇచ్చారు. "కళ్యాణం కమనీయం జీవితం" సినిమా ఒక కొత్త తరహా కథతో కథనంతో మీ అందరినీ ఆకట్టుకుంటుంది. మీ సపోర్ట్ మా మూవీకి ఉండాలి. అన్నారు.

డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ "కళ్యాణం కమనీయం జీవితం" టైటిల్ చూసి మీకు పెళ్లయ్యిందా అని డైరెక్టర్ ను అడిగాను. టీజర్ చూస్తే ఆకట్టుకునేలా ఉంది. ఇంత భారీగా తెరకెక్కించారు. తన లైఫ్ నుంచి ఇన్స్ పైర్ అయ్యి చేసిన సినిమా ఇదని డైరెక్టర్ రవి చెప్పారు. చాలామంది కొత్త దర్శకులు రూపొందించే ప్రేమ కథలు వారి నిజ జీవితాల నుంచి స్ఫూర్తి పొందినవే ఉంటాయి. అవన్నీ సూపర్ హిట్స్ అయ్యా. అలాగే "కళ్యాణం కమనీయం జీవితం" సినిమా కూడా మంచి విజయం సాధించాలి. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు.

డైరెక్టర్ రవి లోకిరెడ్డి మాట్లాడుతూ నా ఎన్నో ఏళ్ల కష్టం ఈ సినిమా వెనక ఉంది. నా నిజ జీవితంలోని కొన్ని ఇన్సిడెంట్స్ కు ఫిక్షనల్ ఎలిమెంట్స్ జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాను. చాలా మంచి లవ్ స్టోరీ ఇది. డ్రామా, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఆకట్టుకుంటాయి. చాలా బ్యూటిఫుల్ గా ఉంటుంది. ఈ కథ రాసినప్పుడు రైటర్ అరవింద్ ఒక కొత్త పాయింట్ ను యాడ్ చేశాడు. ఆ పాయింట్ తో మూవీ స్క్రిప్ట్ మరింత ఇంట్రెస్టింగ్ గా మారింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**